# అందమైన మలుపు

కోలపల్లి ఈశ్వర్

చాలా కథలు చదివాను. కథలాగే జీవితమూ అందంగా ఉంటుందని కలలు కన్నాను. కల ల్లోనే బ్రతికాను. చివరికి నా జీవితం కూడా ఒక వెరైటీ కథ అవుతుందని మాత్రం నేను ఏనాడూ ఊహించలేకపోయాను.

చిన్నప్పుడు పుస్తకాలు తెగ చదివేదాన్ని. మా వీధి చివరలో ఒక పోలియోవ్యక్తి రెంటెడ్ బుక్స్ లైబ్రరీ నడుపుతూంటే... రోజూ ఒక వీక్లీనో, నవలో తెచ్చుకుని, మొదటి పేజీనుంచి చివరి పేజీదాకా చదవందే నిద్రపట్టేది కాదు.

కథలు రాయడం ఒక గొప్ప కళని, అది మనిషికి అబ్బడం అంటే పూర్వజన్మ సుకృతం అనీ భావించేదాన్ని. నాకు బాగా నచ్చిన కథ లేదా నవలా రచయిత్రులు లేదా రచయితల చిరునామాలు సేకరించి వారికి ఉత్తరాలు కూడా రాస్తుండే దాన్ని ఆసక్తిగా.

అప్పుడు 'కడలి కౌగిలిలో' అనే నవల విపరీతమైన ప్రజాభిమానం చూరగొంది. ఆ నవల రాసింది 'భవ్య' అనే రచయిత్రి. వెంటనే పబ్లిషర్స్‌ని సంప్రదించి, ఆవిడ చిరునామా సంపాదించాను. ఆ తర్వాత ఆ రచయిత్రికి తీరిగ్గా ఒక ఉత్తరం రాసాను.

గౌరవనీయులైన 'భవ్య' గారికి,

నమస్కారములు.

నా పేరు నెల్లూరు బృంద (నెల్లూరు మా ఇంటిపేరు. ఊరిపేరు కూడా). మీ కథలు చాలా చదివాను. అందులో నాకు చాలా బాగా నచ్చినవి 'అతని వెనుక ఆండాళ్లు', 'తపస్సు లేని వరం', 'కొండ మీది కోతి', 'ఇచ్చట అమ్మలు అమ్మబడును', 'అత్తగారి పెత్తనం'.

ఈ మధ్య విడుదలైన మీ నవల 'కడలి కౌగిలిలో' అద్భుతంగా ఉంది. ఆ నవలలోని పాత్రలు, సంఘటనలూ నా జీవితానికి చాలా దగ్గరగా వున్నట్టనిపించి ఈ ఉత్తరం రాస్తు న్నాను. మీరు ఈ నవల కేవలం ఊహించి రాసింది మాత్రం కాదు. ఎప్పుడో, ఎక్కడో మీరు నాకు తటస్థపడి వుండాలి. లేకపోతే ఇంత ఖచ్చి తంగా నా జీవితాన్ని పోలిన నవలని రాయ లేరు. నేనెంతగానో ఆలోచించాను. బుర్రబద్దలు చేసుకున్నాను. కానీ, మీరు ఎవరై ఉంటారనేది మాత్రం కనుక్కోలేకపోతున్నాను. ఇక మీరే ఈ చిక్కుముడిని విప్పాలి. ఈ ఉత్కంఠ నేను భరించ

లేకుండా ఉన్నాను. చూసారా ఈ టెన్షన్‌లో పడి మీ నవల గురించి, అందులోని పాత్రల తీరుతెన్నుల గురించీ నేను విశ్లేషించనే లేదు. ముందసలు నా ప్రశ్నకు జవాబు దొరకని వ్వండి... అప్పుడు మీ నవల గురించి కూలంకషంగా రాస్తాను... ఉంటాను...

ఇట్లు... నెల్లూరు బృంద

*3-1-85*, నవాపేట, నెల్లూరు-*524 002*. ఇది నా చిరునామా. ప్లీజ్... జవాబు రాయండి.

భవ్య విశాఖ పట్టణంలో ఉంటోంది. ఆ అడ్రస్‌కే నేను ఉత్తరం రాసింది.

వారం రోజుల తర్వాత మా ఇంటికో ముసలాయన వచ్చాడు. ఆయన్ను గతంలో ఎప్పుడూ చూసిన గుర్తులేదు.


"భవ్య దగ్గర నుండి వచ్చాను. నా పేరు రాఘవయ్యనాయుడు" అన్నాడాయన నన్ను చూసి తానెవరో చెప్పుకుంటూ.

నాకు భయంతో గుండె దడదడలాడింది. నాన్న ఆఫీసుకి వెళ్లారు. అమ్మ ఇంటి వెనుక గేదెలకొట్టం వద్ద శుభ్రం చేయిస్తూ వుంది... అయినా ధైర్యం కూడదీసుకుంటూ అడిగాను.

"చెప్పండి... నాపేరు బృంద... ఏం పని మీద వచ్చారు?" అని అడిగానే గానీ, కంగారుగా వుంది నాకు. ఇది తగిన ప్రశ్న అవునో, కాదో తెలియదు. కానీ ఇంకేం అడగాలో తోచటం లేదు. అయోమయంగా వుంది.

"నేను భవ్యకి బాబాయినవుతానమ్మా... నిన్ను చూసి వెళదామని వచ్చాను" నవ్వాడతను ప్రశాంతంగా.

"నన్నా...? నన్ను... చూసిపోవడానికా?!



ఎందుకూ?" అన్నాను కీచుగొంతుతో.

"మరేంలేదు... ఊరికే... ఫర్వాలేదు... అందంగానే వున్నావు... సరేమరి... నేవెళ్లి రానా?" అంటూ వెళ్లిపోయాడు.

నాకు చెప్పలేని భయంతో ఒళ్లంతా చెమటలు పోసాయ్... ఎవరీయన? ఎందుకొచ్చినట్టు? భవ్య బాబాయిననని చెప్పారనుకో... ఇప్పుడేం జరగబోతోంది? నయం! ఆయన ఉన్నప్పుడు నాన్నో, అమ్మో ఉండివుంటే - ఏమిటిదంతా? ఎక్కడి నుండో ఎవరో రావడం ఏమిటి? నీ అడ్రస్ వాళ్లకెలా తెలుసు? ఏదో కథలూ, కాకరకాయలూ గుట్టుగా చదువుకుంటున్నావు అనుకున్నాంగానీ, వాళ్లకి ఉత్తరాలు రాసి ఇలా పిలిపించుకోవటం ఏమిటి? అని నిలదీస్తే ఏం జవాబు చెప్పను?

ఎక్కువ సేపు ఆలోచిస్తే - పిచ్చి పడుతుందేమోనని గబగబా పెరటి వైపు వెళ్లాను.

* * *

వారం రోజుల తర్వాత కాలేజీ నుంచి వస్తూంటే నన్ను ఓ యువకుడు ఫాలో అవడం గమనించాను. మనిషి మర్యాదస్తుడిలాగే ఉన్నా... అలా వెనక వెనకే రావడం చూసి హడలెత్తిపోయి... వడివడిగా నడుస్తూ అదురుతున్న గుండెలతో ఇల్లు చేరాను.

ఆ యువకుడు రెంటెడ్ లైబ్రరీలోకి దూరటం గేటు దగ్గరనుండి చూసి ఆశ్చర్యపోయాను.

కానీ కాసేపటి తర్వాత - ఇందాక వెంబడించిన వ్యక్తి మా ఇంటికే వచ్చేసాడు నేరుగా.

"ఎవరు కావాలి బాబూ?" అంది మా అమ్మ - ఎవరా? అని ఆసక్తిగా చూస్తూ.

"మీ అమ్మాయండీ..." అన్నాడతను ధైర్యంగా... లోపలికి తొంగి చూస్తున్నాడు పైగా.

అంతా వింటున్నాను, చూస్తున్నాను...

మా అమ్మకు ఆవేశం ఆగింది కాదు.

"ఏమిటి నువ్వు మాట్లాడేది? ఎవరు నువ్వు? ఏం తమాషాగా వుందా? పోలీస్ స్టేషన్ దగ్గరలోనే ఉంది. అది గమనించావా? ముందసలు నడువ్ బయటికి... బిగ్గరగా అరిచేసింది కోపంతో.

"ప్లీజ్... ఆవేశపడకండి... నాపేరు శ్రీరామ్... నేను విశాఖపట్టణం నుంచి మీ అమ్మాయి కోసమే వచ్చాను... మీ అమ్మాయిని పిలవండి... మాట్లాడాలి..." అన్నాడతను కూల్‌గా.

"విశాఖ నుంచి నువ్వు మా అమ్మాయి కోసం రావటం ఏమిటి? ఎవరు నువ్వసలు? మా అమ్మాయికీ నీకూ ఎలా పరిచయం? ఈ పోకిరీ మాటలు నాదగ్గర పని చెయ్యవ్... ఇలా ఇంటికొచ్చి అల్లరి చేయడం భావ్యం కాదు..."

"నేను అల్లరివాడిని కానండీ... అల్లరి రచనలు చేస్తున్న మాట మాత్రం వాస్తవం... నేను 'భవ్య' అనే పేరుతో కథలూ అవీ రాస్తుంటానండీ... ఇప్పటి వరకూ ముప్పయ్ కథలూ, మూడు నవలలూ అచ్చయ్యాయి. వైజాగ్‌లో నేను ఆంధ్రాబ్యాంక్‌లో పనిచేస్తున్నాను. మీ అమ్మాయి నాకు నచ్చింది... మీ కిష్టమైతే పెళ్లి చేసుకుంటాను..." చెప్పదలుచుకున్నదంతా స్పష్టంగా, సూటిగా, సన్నని చిరునవ్వుతో చెప్పేసాడతను.

నా మెదడు మొద్దుబారిపోయినట్లయింది... 'భవ్య' అంటే ఎవరో అమ్మాయి అనుకున్నాను. ఎంత ఫూలిష్‌గా ప్రవర్తించాను? ఇప్పుడేమిటి చేయటం? ఇలా ఇరుక్కుపోయాను ఏమిటి? అమ్మా నాన్నా ఏమనుకుంటారు? నేనేదో ప్రేమాయణం సాగించాను అనుకోరూ? కానీ, ఇతనేమిటి? నన్ను పెళ్లిచేసుకుంటాను అంటు

న్నాడు... నా గురించేం తెలుసని? అసలిత నెవరో? ఇందాకే కదా నన్ను చూసాడు... వెంబ డించాడు... రెంటెడ్ బుక్స్ లైబ్రరీలోకి వెళ్లా డు... అంతలోనే పెళ్లి నిర్ణయం తీసేసుకోవడ మేనా? అప్పుడొకసారి 'భవ్య' బాబాయినంటూ ఒకతను వచ్చి వెళ్లాడు కదా... అంతా కన్ఫ్యూ జన్‌గా వుంది.

అమ్మ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది...

ఎలాగో... కాసేపటికి నోరు పెగుల్చు కుని... "సరేనబ్బాయ్... బ్యాంక్‌లో పనిచేస్తున్న మాట వాస్తవమే అనుకుందాం... అయితే ఎవ రన్నా పెద్దవాళ్లు వచ్చి మాట్లాడతారు గానీ... ఇదేమిటి? ఏకంగా నువ్వే వచ్చి పెళ్లి చేసుకుం టాను అనడం... విడ్డూరంగా ఉంది... నీకులం ఏమిటో? గోత్రం ఏమిటో? మీ అమ్మా నాన్నా ఎవరో? ఏం తెలుసుకోకుండా... ఇదేంటి... పెళ్లంటే ఆటలా? కథల్లో రాసినట్టుగా జరగా లంటే ఎలా? నువ్వా పెళ్లో రామచంద్రా... అని పరిగెత్తగానే..."

అమ్మ మాటలకు అతను మధ్యలో అడ్డొ చ్చాడు. "మీ అమ్మాయి గురించి నాకు బాగా తెలుసండీ! మీ బృంద లెటర్ కూడా రాసింది... చదివాను... ముందుగా మా బాబాయిని ఓ వారం క్రిందట పంపించాను. బృందని చూసా డు... ఆయన నాకు మీ గురించి అన్ని విష యాలూ చెప్పాకే స్వయంగా నేనొచ్చాను..." అన్నాడతను ఏం జంకకుండా.

* * *

విశాఖలో డాబా గార్డెన్స్ వద్ద మా పెద్దమ్మా వాళ్లు ఉన్నారు. మా అమ్మా, నాన్నలు వారిని సంప్రదించి... ఒక రోజు వైజాగ్ వెళ్లి 'భవ్య' (శ్రీరామ్) గురించి వివరాలన్నీ స్వయంగా చూసి... సంతృప్తిపడి నాపెళ్లి శ్రీరామ్‌తో నిశ్చ యించారు. అత్యంత వైభవంగా జరిగిపోయిం ది నా పెళ్లి.

తొలిరాత్రి ఆయన బిగి కౌగిలిలో ఒదిగి పోతూ, అలసిపోతూ - నా మనసులో ఉన్న సందేహాన్ని బయట పెట్టాను.

"అవునూ... మీకు నాగురించి ఎలా తెలు సు? నా జీవితాన్ని అచ్చుగుద్దినట్టుగా 'కడలి కౌగిలిలో' నవల్లో రాసారు. ఇప్పటికైనా చెప్పం డి... ఆ రహస్యం ఏమిటో? ప్లీజ్..."

శ్రీరామ్ చిరునవ్వు నవ్వాడు.

కౌగిలి కొంచెం సడలించి, నా బుగ్గ మీద సన్నగా మీటి "నువ్వు పుస్తకాలు రెంట్‌కి తెచ్చు కునే షాపు ఓనరు... వాడు మాకు దూరపు చుట్టాలబ్బాయ్... తమ్ముడి వరస... నిజానికి వాడు నిన్ను ఇష్టపడ్డాడట... అందుకని నిన్ను బాగా అబ్జర్వ్ చేయసాగాడు... తన అవిటి తనానికి నీలాంటి సౌందర్యరాశి తగదని, తను అనర్హుడినని, ఇంత సాంప్రదాయం గల కుటుం బంలో ఆడపిల్ల ఈ రోజుల్లో దొరకటం కాస్త దుర్లభమని భావించి - నీ గురించి నాకు ఉత్త రం రాసాడు. ఒకసారి వచ్చి నేను వాడ్ని కలిసి మొత్తం నీ డీటెయిల్స్ తీసుకున్నాను... నవల రాశాను... అది క్లిక్కయింది... నువ్వా చది వావ్... ఆశ్చర్యపడ్డావ్... నాకు లెటర్ రాసావ్... తర్వాత నీకు తెలిసిందేగా... మా బాబాయి రావడం, నేను రోమియోలాగా నిన్ను ఫాలో కావడం... ఇప్పుడిలా... అంటూ గాఢంగా నన్ను హత్తుకున్నాడు.

పుస్తకాలు చదవటం అనే ఒక మంచి హాబీ... మనిషి జీవితాన్ని మంచి మలుపు తిప్పుతుందనడానికి నా కథే ఒక మంచి ఉదా హరణ అనుకుంటూ తృప్తిగా శ్రీరామ్‌ని అల్లు కున్నాను.